సాక్షి
సిద్దిపేట
ఆదివారం । 15 । జనవరి । 2023

న్యూస్‌రీల్

తండ్రి కుర్చీలో తనయుడు

కొమురవెల్లి ఆలయంలో వివాదం



కుర్చీలో చైర్మన్ తనయుడు, పక్కన భిక్షపతి

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ చైర్మన్ గీస భిక్షపతి వ్యవహారం వివాదాస్పదంగా మారింది. శనివారం తన తనయుడిని చైర్మన్ కుర్చీలో కూర్చోబెట్టి ఫొటో తీసి ఫోన్‌లో స్టేటస్ పెట్టుకున్నాడు. ఇది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. చైర్మన్ కుర్చీని అవహేళన చేసే విధంగా వ్యవహరించడం సిగ్గుచేటని బీజేపీ, సీపీఎం నాయకులు విమర్శించారు. వెంటనే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం చైర్మన్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. ఇదే విషయమై చైర్మన్ గీస భిక్షపతిని వివరణ కోరగా.. కలెక్టర్లు, ఐపీఎస్ అధికారులు సరదాగా తమ పిల్లలను కుర్చిలో కూర్చోబెడతారు. వాళ్లలాగే మా అబ్బాయి ముచ్చటపడితే కూర్చోబెట్టి ఫొటో తీసి స్టేటస్ పెట్టా. అందులో తప్పేముందని అన్నారు.

మట్టి రోడ్లకు మహర్దశ



బీటీ రోడ్డుగా మారనున్న అక్కేనపల్లి- సిద్దన్నపేట రోడ్డు

నంగునూరు(సిద్దిపేట): మండలంలోని పలు గ్రామాల్లో బీటీ రోడ్ల నిర్మాణానికి రూ. 10 కోట్ల 94 లక్షలు మంజూరయ్యాయని ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. మండలంలోని సిద్దన్నపేట, అక్కేనపల్లి, మగ్దుంపూర్, పాలమాకుల, రాంపూర్, నాగరాజుపల్లి, ఖానాపూర్, వెంకటాపూర్ గ్రామాల ప్రజలు మట్టి రోడ్లతో ఇబ్బంది పడేవారన్నారు. గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు ప్రతిపాదనలు పంపగా నిధులు మంజూరు చేశామన్నారు. టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించామని చెప్పారు. నిధులు మంజూరు చేసిన మంత్రి హరీశ్‌రావుకు మాజీ ఎంపీపీ శ్రీకాంత్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

పాడి రైతులు ఆర్థికంగా ఎదగాలి



ప్రోత్సాహకం అందజేస్తున్న దృశ్యం

మద్దూరు(హుస్నాబాద్): వ్యవసాయ అనుబంధ రంగం పాడి పరిశ్రమతో రైతులు ఆర్థికంగా ఎదగాలని విజయ డెయిరీ చైర్మన్ ఖాజా హిదయతుల్లా సిద్దిక్ అన్నారు. శనివారం మండలంలోని లద్నూరు గ్రామంలో విజయ పాల ఉత్పత్తి కేంద్రంలో పాడి రైతులకు సంక్రాంతి కానుకగా బోనస్ అందించారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఇర్రి రాజిరెడ్డితో కలిసి శనివారం రైతులకు అందజేశారు. సొసైటీ లాభాల్లో నుంచి 152 మంది పాడి రైతులకు సమారు రూ. 3.10 లక్షలను అందజేశామన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బెదద కుమారస్వామి, డైరెక్టర్లు కొమురవెల్లి ఆలయ డైరెక్టర్ కాసర్ల కనుకరాజు తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేట పట్టణంలోని ప్రియదర్శిని కాలనీలో ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెడుతున్న చిన్నారులు



సిద్దిపేటలో గాలిపటాలు ఎగురవేస్తున్న యువతులు

సంబరాల సంక్రాంతి

కళకళలాడుతున్న పట్టణాలు, పల్లెలు

సాక్షి, సిద్దిపేట: జిల్లావ్యాప్తంగా సంక్రాంతి శోభ కనిపిస్తోంది. ఇళ్ల ముందు ముత్యాల ముగ్గులు వేసేందుకు యువతులు పోటీ పడి మరీ వేశారు. వాకిళ్లలో రంగురంగుల ముగ్గులు సరికొత్త అందాన్ని తెచ్చిపెడుతున్నాయి. ఆనందోత్సాహాల మధ్య చిన్నాపెద్ద తేడా లేకుండా పతంగులు ఎగురవేస్తున్నారు. సన్నాయి సంగీతంతో బసవన్నలు పల్లెలను మేల్కొల్పుతున్నాయి. ఇళ్లిల్లూ తిరుగుతూ అయ్యవారికి దండం పెట్టు.. అమ్మవారికి దండం పెట్టు అంటూ బసవన్నలను ఆడిస్తూ మరింత సందడి చేస్తున్నాయి. శనివారం భోగి పండగను ఘనంగా జరుపుకున్న ప్రజలు, ఆదివారం మకర సంక్రాంతిని జరపుకునేందుకు ఏర్పాట్లు సిద్ధం చేసుకున్నారు. ఏ స్థాయిలో ఉన్నా ఇంటి ఎదుట రంగుల ముగ్గులు వేస్తామని స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు చెబుతున్నారు. సంక్రాంతి సందర్భంగా 'సాక్షి' వారిని పలకరించింది. వారి మాటల్లోనే..

రేగు పండ్లు తెచ్చే వాళ్లం..



నా చిన్నతనంలో నా పుట్టినిల్లు జగిత్యాలలో రేగు పండ్లు, ఆవు పేడ, బంతి పూలు ముందుగానే తెచ్చుకునే వాళ్లం. ఇప్పటికీ మా ఇంటి ముందు పెద్ద ముగ్గు వేసి గొబ్బెమ్మలు పెడతాను.

– సరోజ,
జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి

అప్పుడు గీతల ముగ్గులే..



నా చిన్నతనంలో గీతల ముగ్గులు ఎక్కువగా వేసే వాళ్లం. ఇప్పుడు చుక్కల ముగ్గులు వేస్తున్నాం. వాటిలో వివిధ రకాల రంగులు అద్దుతున్నాం. మా ఇంట్లో ఐదేళ్ల లోపు పిల్లలకు భోగి పండ్లు పోస్తాం. మా అమ్మ వాళ్ల ఇంట్లో పాలు పొంగించేవాళ్లం. ఇప్పుడు మా ఇంట్లో ధాన్యాన్ని పోసి ధాన్యలక్ష్మీని ఆహ్వానిస్తున్నాం.

– వేలేటి రోజాశర్మ,
జెడ్పీ చైర్‌పర్సన్

పెద్ద ముగ్గు నేనే వేస్తా



నేను స్కూల్‌కు వెళ్లే సమయంలో జనవరి 1 నుంచి కనుమ పండుగ వరకు పెద్ద ముగ్గులు వేశాను. స్కూల్‌కు వెళ్లే సమయంలో ఎవరి ఇంటి ముందు వేసిన ముగ్గు నాకు నచ్చితే వెంటనే చుక్కలు లెక్కపెట్టి మా ఇంటి ముందు వేసే దాన్ని. ఇప్పటికీ ఉద్యోగ రీత్యా ఎంత బిజీగా ఉన్నా సంక్రాంతి సమయంలో మా ఇంటి ముందు పెద్ద ముగ్గు నేనే వేస్తా. మాది వ్యవసాయ కుటుంబం కావడంతో చిన్నతనంలో కనుమ రోజు ఆవులకు పూజ చేసి వాటికి దోసకాయ, బెల్లం, రేగు పండ్లు పెట్టివాళ్లం.

– నీరజాప్రభాకర్, వైస్ చాన్స్‌లర్,
కొండాలక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం

ఇంటికి శోభ తెస్తాయి



చిన్నప్పటి నుంచి ఇంటి ముందు ముగ్గులు వేయడం అలవాటు. తెల్లవారుజామున వాకిట్లో ముగ్గులు వేసిన తర్వాతనే ఇంటి పనులు చక్కదిద్దుతాను. ఎక్కువగా చుక్కల ముగ్గులు వేస్తాను. ముగ్గులు తెలుగింటి ఆడపడుచులకు ఆత్మగౌరవ ప్రతీకగా నిలుస్తాయి. సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పడుతూ ఇంటికి శోభ తెస్తాయి.

– ఆకుల రజిత,
మున్సిపల్ చైర్‌పర్సన్, హుస్నాబాద్

పోటాపోటీగా వేసే వాళ్లం



సంక్రాంతి అంటే నాకు చాలా ఇష్టం. పండగ వచ్చిందంటే చాలు చిన్నప్పటి నుంచి ఇళ్ల ముందర రంగురంగుల కలర్లతో పోటాపోటీగా ముగ్గులు వేసే వాళ్లం. ముగ్గుల పోటీల్లో సైతం పాల్గొనే వాళ్లం. నాకు ముగ్గులు వేయడం అంటే చాలా ఇష్టం. ఇప్పటికీ ఎంత బిజీగా ఉన్నా ఇంటి ముందర వాకిట్లో ముగ్గులు వేస్తా. నా కూతుర్లకు సైతం సంక్రాంతి విశిష్టతను తెలుపుతూ ముగ్గులు వేయడం నేర్పిస్తున్నా.

– గన్నె వనితా,
మున్సిపల్ చైర్‌పర్సన్, దుబ్బాక

వారం రోజుల ముందే ప్లాన్ చేసే వాళ్లం



సంక్రాంతి వస్తుందంటే నా చిన్నతనంలో వారం రోజుల ముందే ముగ్గు వేయాలని ప్లాన్ చేసే వాళ్లం. ఉదయం ఐదు గంటలకే లేసి మా ఇంటి ముందు పెద్ద ముగ్గు వేసి రంగులు అద్దె వాళ్లం. ముగ్గు వేసేందుకు కనీసం మూడు గంటలు పట్టేది. ఇప్పటికీ ఎంత బిజీగా ఉన్నప్పటికీ సంక్రాంతి సమయంలో ముగ్గులు నేనే వేస్తాను.

– దేవకిదేవి,
జిల్లా పంచాయతీ అధికారి

గ్రామాల అభివృద్ధికి కృషి

దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు

తొగుట(దుబ్బాక): నియోజకవర్గంలో గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్నామని దుబ్బాక ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. మండలంలోని పెద్ద మాసాన్‌పల్లి, ఎల్లారెడ్డిపేట, తుక్కాపూర్, కాన్గల్, లింగాపూర్, గుడికందుల గ్రామాల్లో ఎమ్మెల్యే నిధుల నుంచి ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎల్లారెడ్డిపేట, పెద్ద మాసాన్‌పల్లి, బండారుపల్లి గ్రామాల మీదుగా 10 కిలోమీటర్ల రోడ్డు మరమ్మతుకు రూ. 2.24 కోట్లు మంజూరు చేయించామని, త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. వెంకట్రావుపేట, లింగాపూర్, ముత్యంపేట గ్రామాల మీదుగా సురంపల్లి వరకు బీటీ రోడ్డు పనులు ప్రారంభమయ్యాని, ప్రస్తుతం ఆరు గ్రామాల్లో లైట్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కొమురవెల్లి మల్లన్న సాగర్ కెనాల్ పనుల్లో భూమి కోల్పోయిన రైతులకు న్యాయం చేస్తామని, తుక్కాపూర్ రైతులకు ఎకరాకు రూ.13లక్షల పరిహారం ఇప్పించామన్నారు. నిధులు మంజూరు కాగానే రైతులకు పరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎల్లారెడ్డిపేట 11కేవీ విద్యుత్ లైన్‌ను మార్చేందుకు అవసరమైన రూ. 3లక్షలలో తన ఒక నెల వేతనం నుంచి రూ.1.50 వేలు విద్యుత్ ఏఈ శ్రీనివాస్‌కు అందజేస్తున్నట్లు ప్రకటించారు. లింగాపూర్‌లో పోచమ్మ ఆలయానికి రూ. 50 వేలు అందించి, కాన్గల్‌లో బీజేపీ నాయకుడు చంద్రశేఖర్‌గౌడ్‌ను పరామర్శించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు, తుక్కాపూర్ సర్పంచ్ చంద్రం, ఉప సర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా మాజీ అధ్యక్షుడు విభీషన్‌రెడ్డి, నాయకులు కొండల్‌రెడ్డి, నర్సింహారెడ్డి, మురళి, బాగయ్య, నరేందర్, కళ్యాణ్‌దాస్, ఆంజనేయులు, పరమేశ్, తదితరులు పాల్గొన్నారు.



గుడికందులలో హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

కొండపోచమ్మ జాతరకు అంకురార్పణ

జగదేవ్‌పూర్(గజ్వేల్): భోగి సందర్భంగా శనివారం మండలంలోని కొండపోచమ్మ దేవాలయం వద్ద అమ్మవారి సదరు పటం వేశారు. ఉదయం వేద పండితులు కొండపోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఏడాది సంక్రాంతిని పురస్కరించుకుని భోగి రోజు అమ్మవారికి సదరు పటం వేస్తామని ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి, చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈనెల 23 నుంచి జాతర ఉత్సవాలు ప్రారంభమై ఉగాది వరకు కొనసాగుతాయని చెప్పారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తామని ఎస్‌ఐ కృష్ణమూర్తి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రజిత, ఎంపీటీసీ కావ్య, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

'ఇందూరు'కు జాతీయస్థాయి ర్యాంకు

సిద్దిపేటఅర్బన్: ఇంటర్‌్నశాల ర్యాంకింగ్ రిపోర్టు– 2022లో ఇందూరు ఇంజనీరింగ్ కళాశాల జాతీయస్థాయిలో 243 ర్యాంకు సాధించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ వీపీ రాజు శనివారం తెలిపారు. కళాశాలలో నాణ్యత ప్రమాణాలు, బోధన తీరు, సౌకర్యాలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని వార్షిక ర్యాంకులను ఇంటర్‌్నశాల సంస్థ కేటాయిస్తుందన్నారు. అందులో భాగంగా జాతీయస్థాయిలో 515 కాలేజీలు పాల్గొనగా ఇందూరు కు 243 ర్యాంకు వచ్చిందన్నారు. సౌత్‌జోన్‌లో 106 ర్యాంకు వచ్చిందని వివరించారు.



ఆకట్టుకున్న విదేశీ వనితలు

సంప్రదాయ దుస్తుల్లో విదేశీ విద్యార్థినులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. స్వీడన్ దేశానికి చెందిన ఎవెలినా, జోసెఫిన్‌లు అప్రంటిస్ నిమిత్తం పాత పంటల జాతరకు వచ్చారు. ప్రస్తుతం వీరు డీడీఎస్ సంస్థలో పని చేస్తున్నారు. జాతరను పురస్కరించుకొని లంగా, ఓణి ధరించి జాతరలో అందరిని ఆకట్టుకున్నారు.

పాతపంటల సందడి

చిరు ధాన్యాల ప్రాధాన్యంపై అవగాహన

జహీరాబాద్: పాతపంటల జాతర శనివారం ఘనంగా ప్రారంభమైంది. మొగుడంపల్లి మండలంలోని జాంగార్‌బౌలి తండాలో డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ(డీడీఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 23వ పాత పంటల జాతర కార్యక్రమానికి ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ సంజనారెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంతరించిపోతున్న చిరు ధాన్యాలను కాపాడుకొని భవిష్యత్ తరాలకు అందించాలన్నారు. వర్షాభావాన్ని సైతం తట్టుకొని చిరుధాన్యాలు పండుతాయని, వీటి సాగుకు ఎలాంటి రసాయన ఎరవులు అవసరం ఉండదన్నారు. దేశంలో ఆహార ధాన్యాలకు కొరత లేదని, దశాబ్ద కాలం నుంచి దేశంలో ఆహార ఉత్పత్తులు బాగా పెరిగాయని పేర్కొన్నారు. చిరుధాన్యాలతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. ఇతర దేశాలతో పోల్చితే భారత దేశంలోని ప్రజలు ఆరోగ్యవంతులుగా ఉంటున్నారని, ఇందుకు కారణాలను పలు దేశాలు పరిశోధిస్తున్నాయన్నారు.

సాగును పెంచాలి

డీడీఎస్ డైరెక్టర్ పీవీ సతీశ్ మాట్లాడుతూ జీవవైవిధ్యంతో కూడుకున్న చిరుధాన్యాల సాగును మరింత పెంచాలన్నారు. రెండు దశబ్దాల క్రితం పాత పంటల జాతరను చిన్నగా ప్రారంభించామని, క్రమంగా విస్తరించిందని పేర్కొన్నారు.



చిరుధాన్యాలతో ఎడ్లబండ్లు



అలరించిన ప్రదర్శనలు

మహిళా రైతులు ప్రదర్శించిన కోలాటం, గిరిజన మహిళల నృత్యాలు అలరించాయి. చెక్క భజన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహిళా రైతులు తమ అనుభవాల గురించి వివరించారు. చిరుధాన్యాల సాగుతో కలిగే ప్రయోజనాలను వివరించారు. పాడి పశువులతో సంతోషంగా ఉన్నట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

చైనా మాంజాతో యువకుడికి తీవ్రగాయాలు



గాయపడిన అస్లాం

జోగిపేట(అందోల్): బైకుపై వెళ్తున్న యువకుడికి తెగిన చైనా మాంజా తాకడంతో కంటికి గాయమైంది. శనివారం జోగిపేటలోని రిక్షా కాలనీ వాసి అస్లాం హనుమాన్ చౌరస్తా మీదుగా బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో తెగిన గాలిపటం మాంజా దారం తగలడంతో కంటికి గాయమైంది. వెంటనే అస్లాంను దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. తృటిలో పెద్ద ప్రమాదమే తప్పినట్లయ్యింది. రెండు రోజుల క్రితం పట్టణానికి చెందిన వ్యాపారి కాసాల ప్రవీణ్ కుమార్ మెడకు మాంజా తగిలి గాయమైంది. యువకులు అప్రమత్తంగా ఉండాలని ప్రమాదాలను కొని తెచ్చుకోవద్దని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

నాయకుల పేరుతో వరినాట్లు



కేసీఆర్ పేరుతో నాటు వేస్తున్న చిన్నారులు

తొగుట(దుబ్బాక): రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, ఆర్థిక ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు, ఎంపీ ప్రభాకర్‌రెడ్డి పేరుతో వరినాటు వేసి చిన్నారులు అభిమానం చాటుకున్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి తన పాలంలో చిన్నారులు విశ్వత్‌రెడ్డి, సాన్విక్‌రెడ్డి కూలీలతో కలిసి శనివారం నాట్లువేశారు. కేసీఆర్‌పై ఉన్న అభిమానంతో వారు ఆయన పేరు వరి మొక్కలతో నాటు వేసిశారు. అంతేగాకుండా టి.హరీశ్‌రావు పేరిట టీహెచ్‌ఆర్, మెదక్ ఎంపీ బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు పేరును కేపీఆర్ పేరుతో వరి మొక్కలతో నాటువేశారు. ఇలా చిన్నారులు వేసిన వరినాటు పలువురిని ఆకట్టుకుంటోంది.

పట్టపగలే దొంగతనం

- రూ. 11.50 లక్షల చోరీ



బీరువాను పగులగొట్టిన దృశ్యం

జహీరాబాద్ టౌన్: ఇంటి తాళాలను పగులగొట్టి నగదును ఎత్తుకెళ్లిన సంఘటన మండలంలోని చిన్నహైదరాబాద్‌లో శనివారం చోటు చేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. చిన్న హైదరాబాద్‌ చెందిన చింతచెట్టు అశోక్ కొంత పొలం అమ్మి గ్రామంలో కొత్త ఇల్లును కట్టుకుంటున్నాడు. నాలుగు రోజుల క్రితం బ్యాంక్ నుంచి రూ.11.50 లక్షలు డ్రా చేసి బీరువాలో భద్రపరిచాడు. అశోక్ పొలం పనులకు వెళ్లగా భార్య ఇంటి నిర్మాణ పనులను చూస్తోంది. ఎవరులేని సమయంలో ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలో దాచిన రూ. 11.50 లక్షల నగదు, 20 తులాల వెండి, తులం బంగారం ఎత్తుకెళ్లారు. పొలం నుంచి ఇంటికి వచ్చిన అశోక్ ఇంటి తాళాలు పగలగొట్టి ఉండడం చూసి చోరీ జరిగిన విషయం గ్రహించి జహీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

గాలిపటమా పదపద.. పద

- గగన వీధిలో తోక చుక్కలు
- పట్టణంలో మొదలైన పతంగుల ఆట
- పెరిగిన విక్రయాలు



దుబ్బాక: సంక్రాంతి పండుగ రానే వచ్చింది. వీధులన్నీ పతంగులతో సందడిగా మారాయి. పిల్లలతో మొదలు పెద్దల వరకు పతంగుల ఎగురవేస్తూ ఉత్సాహంగా కేరింతలు కొడుతున్నారు. రంగు రంగుల పతంగులు ఆకాశ వీధుల్లో షికార్లు కొడుతున్నాయి. వీటిని చూస్తూ మరికొందరు ఎంజాయ్ చేస్తున్నారు. సాధరణంగా పేపరు, వెదురు పుల్లలతో తయారైన పతంగులు ఆధునికతను జోడించుకుని వేలాది డిజైన్‌లల్లో తయారవుతున్నాయి. జిల్లా కేంద్రంలోని సిద్దిపేట, దుబ్బాక, దౌల్తాబాద్, గజ్వేల్ ప్రాంతాల్లో హోల్‌సెల్ వ్యాపారులు రిటైలర్లకు అమ్ముతున్నారు.

అందుబాటులోకి రకరకాల పతంగులు

తోక పతంగి, ఫిష్‌కైట్, రంగీలా, జరీ, బట్ట, సిల్వర్, గోల్ట్, లాంతర్, ఈగల్, డేగ, ట్రైయాంగిల్, డ్రాగన్, పబ్జీ, కార్టున్ లవర్స్ పతంగులు సిద్దిపేటతో పాటు దుబ్బాకలో లభిస్తున్నాయి. చిన్న, పెద్ద సైజుల్లో తయారు చేసి వీటిని విక్రయిస్తున్నారు. వీటిని హైదరాబాద్, గుజరాత్ వంటి ప్రాంతాల నుంచి పతంగుల వ్యాపారులు తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. పతంగులు ఎగరవేయడానికి దారాలు వాటిని చుట్టడానికి అందమైన చరకాలు, ప్లాస్టిక్ కర్రలతో చేసినవి లభిస్తున్నాయి.



సిద్దిపేటలో..

కైట్స్ అదుర్స్

ఆకాశంలో ఎగిరే కైట్స్ అదుర్స్ అనిపిస్తున్నాయి. కాగితం, వెదురు పుల్లలతో చేసినవి కాకుండా క్లాత్, ప్లాస్టిక్, పేపర్, సిల్వర్, గోల్డ్ రంగుల పతంగులు, లాంతర్ పతంగులు అమ్మకాలు జిల్లా కేంద్రంలో జోరుగా సాగుతున్నాయి. పట్టణంలో పిల్లలు, పెద్దలు బిల్డింగులు ఎక్కి, మైదానాల్లో ఇతరులతో పోటీపడుతూ ఎగురవేస్తున్నారు.



దరలు ఇలా..

దుబ్బాకలో పతంగులు, దారాలతో కలిపి విక్రయిస్తున్నారు. దారాలు రూ.2 నుంచి రూ.40, మాంజాలు రూ.5 నుంచి రూ.40, దారం చరకాలు రూ.30 నుంచి రూ.80 వరకు అమ్ముతున్నారు. సాధరణ పతంగులు రూ.2 నుంచి రూ.50 ధరల్లో అమ్మకాలు జరుగుతున్నాయి.

జాగ్రత్తలు పాటించాలి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): గాలి పటాలు ఎగరేసే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలి. ఆకాశ వీధిలో రంగురంగుల పతంగులు కనువిందు చేస్తున్నాయి.పిల్లలంతా ఒకచోట చేరి వాటిని ఎగురు వేస్తూ ఎంజాయ్ చేస్తున్నారు. అయితే పతంగులు ఎగురవేసేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోకపోతే సంతోషం విషాదంగా మారే ప్రమాదం ఉంది. ముఖ్యంగా విద్యుత్ తీగలకు చిక్కు కున్న గాలిపటాలను తీయడానికి ప్రయత్నించి పలువురు మృతిచెందిన ఘటనలు గతంలో చాలా జరిగాయి. అదేవిధంగా పతంగులు ఎగురు వేస్తూ భవనాల పైనుంచి కిందపడి కొందరు ప్రాణాలు పోగొట్టుకున్న వారూ ఉన్నారు.అందుకే పిల్లలు వీటిని ఎగురువేసే సమయంలో పెద్దల పర్యవేక్షణ తప్పనిసరి అవసరం.

సురక్షిత ప్రాంతంలో..

- పిట్ట గోడలు లేని ఇంటి భవనాలపై పతంగులను ఎగురవేయొద్దు.
- రహదారులపై ఎగురవేస్తూ వాహనాలు కింద పడే ప్రమాదముంది. రోడ్లపైకి రావొద్దు.
- తెగిపడిన గాలిపటం కోసం వెనకాముందు చూసు కోకుండా పరుగెత్తొద్దు.
- విద్యుత్ లైన్లకు దూరంగా ఎగురవేయాలి.
- విద్యుత్ స్తంభాలకు, వైర్ల మధ్య ఇరుక్కున్న పతంగులను, తెగిన మాంజాలను చేతితో, ఇనుప చువ్వలతో తీయవద్దు.
- పతంగులను ఎగురవేసేందుకు మెటాలిక్ దారాలను ఉపయోగించవద్దు. వీటిని వినియోగిస్తే విద్యుత్ తీగలకు తగిలినప్పుడు షాక్ కొట్టే అవకాశం ఉంది.
- సాధ్యమైనంత వరకు గాలి పటాలను ఆరుబయట, మైదాన ప్రాంతాల్లోనే ఎగురవేయాలి

సంక్రాంతి పండగ అంటేనే స్పెషల్ క్రేజ్



సంక్రాంతి పండుగ అంటేనే స్పెషల్ క్రేజ్. సంక్రాంతి వస్తుందంటే ముగ్గులు వేయడం ఎంత ఇష్టమో గాలిలో పతంగులు ఎగరవేయడం అంతే ఇష్టం. అన్ని వర్గాల వారిని ఆకట్టుకునేలా పతంగులు జిల్లా కేంద్రంలో లభిస్తున్నాయి. పతంగులు ఎగరవేసేటపుడు జాగ్రత్తలు పాటించాలి.

– అనూష, దుబ్బాక

మా వీధిలో సందడే .. సందడి



సంక్రాంతి వచ్చిందంటే మా వీధిలో నేను మా దోస్తులంతా సందడి చేస్తాం. వివిధ రకాల పతంగులు తీసుకువచ్చి మా దాబాపై ఎగరవేస్తూ పోటీ పడుతుంటాం. రాత్రి సమయంలో మ నాన్న ఎగరవేసే లాంతర్ పతంగి అంటే నాకు ఎంతో ఇష్టం.

– రుత్విక్, దుబ్బాక

పిల్లలపై పెద్దల పర్యవేక్షణ ఉండాలి



పిల్లలు గాలిపటాలు ఎగరవేసే సమయంలో తల్లిదండ్రుల పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలి. నిషేధిత చైనా మాంజాను ఉపయోగించవద్దు. దీనిని విక్రయిస్తే చర్యలు తప్పవు. భారీ భవనాలపై గాలిపటాలను ఎగరవేయొద్దు.

– నవీన్ కుమార్, సీఐ, సదాశివపేట

ప్రమాదవశాత్తు గడ్డివాములు దగ్ధం



మంటలను ఆర్పుతున్న కుటుంబ సభ్యులు, స్థానికులు

దుబ్బాక: ప్రమాదవశాత్తు గడ్డివాములు దగ్ధమైనా ఘటన రాయపోల్ మండల కేంద్రంలో శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన తలారి రాజేందర్ , తలారి అంజయ్య అన్నదమ్ములు వ్యవసాయం చేస్తున్నారు. వానాకాలం పంట పూర్తి కావడంతో పశువుల మేత కోసం సుమారు పది ట్రాక్టర్ల గడ్డివాములను నిల్వ చేసుకున్నారు. శనివారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు గడ్డివాములకు నిప్పు అంటుకుంది. దీంతో కుటుంబ సభ్యులు , స్థానికులు చూసి మంటలను అదుపు చేసే ప్రయత్నం చేసిన ఫలితం లేకపోవడంతో ఫైర్ ఇంజన్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పినా గడ్డివాములు కాలిపోయాయి. గడ్డి వాముల విలువ సుమారు రూ.60 వేలు ఉంటుందని అన్నదమ్ములు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ



రోడ్డు నిబంధనలు, భద్రతపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ రామకృష్ణ

సిద్దిపేటకమాన్: వాహనదారులు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు పాటించాలని సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా ట్రాఫిక్, రోడ్డు నిబంధనలపై సిద్దిపేట పట్టణంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాలను ఈనెల 11 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా సీపీ ఆదేశానుసారం ప్రజలకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పాఠశాలలు, కళాశాలలకు అధికారులు, సిబ్బంది వెళ్లి రోడ్డు ప్రమాదాలు, మోటార్ వాహనాల చట్టాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. వాహనదారులు రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటుచేసిన సూచిక బోర్డుల సూచనలు పాటిస్తూ క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. వేగంగా వెళ్లే వాహనానికి, సాధారణ స్పీడ్‌తో వెళ్లే వాహనానికి తేడా 15 నిమిషాలు మాత్రమే తేడా ఉంటుందన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపేటప్పుడు సీటు బెల్టు ధరించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ఏటా భద్రతా వారోత్సవాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. వాహనదారులు, ప్రజల్లో మార్పు వచ్చినప్పుడు మాత్రమే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



గేదె కళేబరం

జిన్నారం(పటాన్‌చెరు): విద్యుదాఘాతంతో గేదె మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మంబాపూర్ గ్రామానికి చెందిన రైతు అరుణ్ గేదెను మేత కోసం తీసుకెళ్లాడు. గేదె మేత మేస్తూ తెగి కిందపడిన విద్యుత్ వైర్లను తాకడంతో అక్కడికక్కడే మృత్యువాత పడింది. విద్యుత్ శాఖ నిర్లక్ష్యంవల్లే గేదె మృతి చెందిందని, తనకు న్యాయం చేసేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని రైతు కోరాడు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి



భరత్‌గౌడ్ (ఫైల్)

మనోహరాబాద్(తూప్రాన్): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందాడు. శనివారం ఎస్ఐ సందీప్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని జీడిపల్లికి చెందిన పాల భరత్‌గౌడ్ (19), గౌటి సురేశ్ శుక్రవారం రాత్రి బైక్‌పై మేడ్చల్ వెళ్తున్నారు. కాళ్ళకల్ శివారు బంగారమ్మ దేవాలయం వద్ద గల యూటర్న్ రాంగ్ రూట్‌లో జేసీబీ బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వీరిలో భరత్‌గౌడ్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి పాల శ్రీనివాస్‌గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య

అప్పుల బాధ తాళలేక ఒకరు, కుటుంబ సభ్యుల వేధింపులతో వివాహిత, కుటుంబ కలహాలతో మరొకరు బలవన్మరణానికి పాల్పడ్డారు. కుటుంబ పోషణ కోసం ఫైనాన్స్‌లో తీసుకున్న అప్పు చెల్లించలేక యువకుడు మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడు. అలాగే అదనపు కట్నం వేధింపులతో వివాహిత ఉరివేసుకుంది. కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు.



శివ (ఫైల్)

దుబ్బాక: అప్పుల బాధతో యువకుడు ఉరివేసుకున్నాడు. ఈ ఘటన రాయపోల్ మండలం వడ్డేపల్లిలో జరిగింది. శనివారం రాయపోల్ ఎస్ఐ షేక్ మహబూబ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని వడ్డేపల్లి గ్రామానికి చెందిన మన్నె లక్ష్మీ బతుకుదెరువు కోసం దోమలగోడలో కూలి పనులు చేస్తోంది. పెద్దకొడుకు మన్నె శివ(21) కొంత కాలంగా వడ్డేపల్లిలో వ్యవసాయం చేస్తూ తన బంధువులతో ఉంటున్నాడు. శివ కుటుంబ సభ్యులు బజాజ్ ఫైనాన్స్‌లో రూ.99 వేల అప్పు తీసుకున్నారు. ఇందుకు ప్రతీ నెల రూ.6 వేలను వాయిదాలు చెల్లిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఈనెల డబ్బులు కట్టకపోవడంతో శుక్రవారం ఉదయం ఫైనాన్స్ సిబ్బంది ఇంటికి వచ్చి వాయిదా కట్టాల్సిందేనని శివను హెచ్చరించి వెళ్లిపోయారు. డబ్బులు కట్టాల్సిందేనని సాయంత్రం శివకు పదేపదే ఫోన్ చేయడంతో తీవ్ర మనస్తాపానికి గురై శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి మృతుదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తన కుమారుడి మరణానికి కారణమైనా ఫైనాన్స్ వారిపై చర్యలు తీసుకోవాలని మృతుడి తల్లి మన్నె లక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జహీరాబాద్ టౌన్: మండలంలోని అనేగుంటలో వివాహిత శనివారం సాయంత్రం ఆత్మచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. రేణుకకు పది నెలల క్రితం గ్రామానికి చెందిన జగదీశ్‌తో పెళ్లి జరిగింది. పెళ్లి సమయంలో తల్లిదండ్రులు కట్నకానుకలు ఇచ్చారు. భర్త, అత్తమామల వేధింపులు తట్టుకోలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుంది. జహీరాబాద్ రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని పొట్లపల్లి గ్రామస్తుడు కుటుంబ కలహాలతో శనివారం సాయంత్రం ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మౌటం సంపత్(42)కు భార్య రేణుక, కొడుకు ఉన్నారు. కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెంది ఉరి వేసుకున్నాడు. ఎస్సై శ్రీధర్‌ను వివరణ కోరగా తమకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని, ఫిర్యాదు చేసిన వెంటనే కేసు నమోదు చేసుకునిని దర్యాప్తు చేస్తామన్నారు.

చెట్టును ఢీకొట్టిన వాహనం



రబింద్ర (ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్): రోడ్డు ప్రమాదంలో కార్మికుడు మృతిచెందాడు. ఈ సంఘటన తూప్రాన్– నర్సాపూర్ హైవే శభాష్‌పల్లి వద్ద శనివారం చోటుచేసుకుంది. వెస్ట్ బెంగాల్ రాష్ట్రం కలకత్తాకు చెందిన రబింద్ర(19) శభాష్‌పల్లి గ్రామ పరిధిలో ఉన్న ఓ పరిశ్రమలో కార్మికుడుగా పనిచేస్తున్నాడు. సరుకులు కొనుగోలుచేసేందుకు యాక్టివాపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు బలంగా ఢీకొనడంతో తలకు బలమైన గాయమైంది. స్థానికులు 108 అంబులెన్స్‌లో తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. యాక్టీవా వెనకాల కూర్చున సుజన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సుజన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవికాంత్‌రావు తెలిపారు.

కంటెయినర్ ఢీకొని..

సంగారెడ్డి టౌన్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన సంగారెడ్డి మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని హనుమాన్ నగర్‌కు చెందిన మన్నె శ్రీకాంత్ బైక్‌పై నర్సాపూర్ వెళ్తుండగా కంటెయినర్ ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

మెదక్ రూరల్: పొలాల్లో గుర్తుతెలియని యువకుడి మృతదేహం హవేలీఘనపూర్ మండలం ఔరంగాబాద్ తండా శివారులో శనివారం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఔరంగాబాద్ తండా శివారు పొలాల్లో దుర్వాసన రావడంతో స్థానికులు గుర్తుతెలియని మృతదేహాన్ని కనుగొన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహం కుళ్లిపోయింది. సుమారు ఐదు రోజుల క్రితం మృతిచెంది ఉండవచ్చని అనుమానిస్తున్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందగా 11 మంది గాయపడ్డారు. కోళ్లను తరలిస్తున్న డీసీఎం వాహనం బైక్ ఢీకొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మనుమడు, మనవరాలు అనారోగ్యానికి గురవడంతో ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని వస్తున్న మహిళను బొలేరో ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. అలాగే అతివేగంగా ఆటోను కారు ఢీకొనడంతో ఏడుగురు, బైక్‌ను వాహనం ఢీకొనడంతో దంపతులు గాయపడ్డారు.

- నాగ్సాన్‌పల్లి సమీపంలో ఘటన



మంద మల్లేశం మృతదేహం

కౌడిపల్లి(నర్సాపూర్): కోళ్లను తరలించే డీసీఎం వ్యాన్ బైక్ ఢీ కొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈసంఘటన కౌడిపల్లి మండలం నాగ్సాన్‌పల్లి కోళ్లఫారం సమీపంలో 765డి జాతీయ రహదారిపై జరిగింది. కౌడిపల్లి ఎస్ఐ శివప్రసాద్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హవేళిఘనపూర్ మండలం గాజిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మంద మల్లేశం(40) హైదరాబాద్ శివారు కూలీ పనులు చేస్తున్నాడు. కాగా శనివారం తన బైక్‌పై హైదరాబాద్ వెళ్తున్నాడు. నాగ్సాన్‌పల్లి కోళ్లఫారం వద్ద 765డి జాతీయ రహదారిపై నర్సాపూర్ నుంచి వస్తున్న కోళ్లను తరలించే డీసీఎం, బైక్ ఢీకొన్నాయి. దీంతో మల్లేశం కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. తలకు హెల్మెట్ ఉన్నప్పటికీ బలంగా ఢీకొనడంతో దుర్మరం చెందాడు. అతడి బైక్ ముందు బాగం నుజ్జునుజ్జు అయ్యింది. బైక్‌లో అతడి ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ ఉండటంతో పోలీసులు మృతుడిని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య సంతోష ,ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృత దేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డీసీఎం డ్రైవర్ కౌడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు.

కారు డ్రైవర్‌పై కేసు

తొగుట(దుబ్బాక): అతివేగంగా కారు నడిపి ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తొగుట ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం మధ్యాహ్నం ఏపీ 23టీఏ 2201 నంబరుగల ఆటో ప్రయాణికులతో సిద్దిపేటకు వెళ్తుండగా సిద్దిపేట నుంచి తొగుటకు వైపుకు వస్తున్న ఏపీ 28 డీపీ6511 నంబరుగల కారు అతివేగంగా వచ్చి ఆటోను ఢీకొంది. ఈ సంఘటనలో ఆటోడ్రైవర్ ఆత్మకూరి ఆంజనేయులు, గజ్వేల్ మండలం కొల్గూరుకు చెందిన బండారి లక్ష్మీ, ఆమె కుమారుడు ప్రభాస్, మండలంలోని ఎల్లారెడ్డిపేటకు చెందిన కనికి లక్ష్మీ, మన్నే భాగయ్య, చందాపూర్‌కు చెందిన బిజుగామ రాజవ్వ, పోచవ్వ గాయపడ్డారు.

వాహనం ఢీకొని దంపతులకు గాయాలు

శివ్వంపేట(నర్సాపూర్): రోడ్డు ప్రమాదంలో దంపతులు గాయపడ్డారు. ఈ సంఘటన మండల పరిధి దొంతి గ్రామ శివారు తూప్రాన్- నర్సాపూర్ హైవేపై శనివారం రాత్రి చోటుచేసుకుంది. తూప్రాన్ మున్సిపల్ పరిధి కరీంగూడకు చెందిన షబీర హమీద్ దంపతులు శివ్వంపేట మండలం దొంతి నుంచి బైక్‌పై ఇంటికి వెళ్తున్న క్రమంలో గుర్తుతెలియని వాహనం బైక్‌ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం 108లో తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు వివరాలు సేకరించారు.

బొలేరో ఢీ: మహిళ మృతి

ముగ్గురికి స్వల్పగాయాలు





సోనీబాయి మృతదేహం

నారాయణఖేడ్: అతివేగంగా వచ్చిన బొలెరో వాహనం ఢీ కొనడంతో హాస్టల్ మహిళా అటెండర్ మృతి చెందగా, ఆమె కూతురు, మనవడు, మనవరాలికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ప్రమాదం నారాయణఖేడ్ పట్టణంలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. నారాయణఖేడ్ పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణఖేడ్ మండలం సీతారాం తండాకు చెందిన జాదవ్ శామ్యానాయక్ తెలంగాణ మలి ఉద్యమంలో ఆత్మబలిదానం చేసుకున్నాడు. తెలంగాణ ఆవిర్భావం అనంతరం ఆయన భార్య జాదవ్ సోనీబాయి (45)కు ప్రభుత్వం మెదక్ జిల్లాలోని నర్సాపూర్ గిరిజన గురుకులంలో అటెండర్‌గా ఉద్యోగం కల్పించింది. సోనీబాయికి ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కుమారులు. కూతుళ్ల వివాహాలు జరిగాయి. పెద్ద కుమారుడు లచ్చునాయక్ (24) నెలక్రితం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో వారం కిందట సోనీబాయి ఖేడ్ గిరిజన బాలికల వసతిగృహానికి బదిలీ చేయించుకుంది. శనివారం మనువడు, మనుమరాలికి సుస్తీ చేయడంతో సోనీబాయి, ఆమె కూతురు సునీత, మనవడు, మనవరాలితో కలిసి ఖేడ్ ప్రాంతీయ ఆస్పత్రికి వచ్చింది. చికిత్స అనంతరం తిరిగి కాలినడకన వెళుతూ ఆస్పత్రి గేటు సమీపంలో రోడ్డు దాటుతున్న క్రమంలో బసవేశ్వరచౌక్ వైపు నుంచి రాజీవ్‌చౌక్ వైపు వస్తున్న బొలెరో వాహనం ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి ఢీకొనడంతో సోనీబాయి తీవ్ర గాయాలు కాగా ఆమె కూతురు సునీత, మనవడు, మనవరాలికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని ఖేడ్ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు సోనీబాయి మృతిచెందినట్లు ధ్రువీకరించారు. మృతురాలి చిన్నకుమారుడు రవినాయక్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు పోలీసులు వివరించారు.

క్లుప్తంగా

అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు

ఆర్థిక మంత్రి హరీశ్‌రావు



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మకర సంక్రాంతి పర్వ దినం సందర్భంగా ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజలకు మంత్రి హరీశ్ రావు భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపారు. సకల సంపదలతో కుటుంబ సభ్యులంతా కలిసి పండను ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో అభివృద్ధితో పాటు సంక్షేమ ఫలాలు ప్రజలకు సమృద్ధిగా అందుతున్నాయన్నారు. పంటలు విస్తారంగా పండాలని, ప్రజలు సుఖశాంతులతో ఉండాలని కోరారు.

రైతు పక్షపాతి సీఎం కేసీఆర్



రైతులకు ఎరువులు పంపిణీ చేస్తున్న దృశ్యం

చిన్నకోడూరు(సిద్దిపేట): రైతు సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తున్న సీఎం కేసీఆర్ రైతు పక్షపాతి అని గంగాపూర్ సొసైటీ చైర్మన్ ములకల కనకరాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ కొండం వనిత అన్నారు. శనివారం మండలంలోని గంగాపూర్ సొసైటీలో రైతులకు ఎరువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ద్వారా రైతుల్లో ఆత్మగౌరవం పెరిగిందన్నారు. గతంలో ఎరువులు, విత్తనాల కోసం రైతులు పడిగాపులు కాసేవారని, ప్రస్తుతం రైతుల వద్దకే అందించిన ఘనత సీఎం కేసీఆర్ దేనన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లింగారెడ్డి, నాయకులు అశోక్ రెడ్డి, రామాగౌడ్, రామస్వామి, సొసైటీ సీఈఓ నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

సిద్దిపేటకమాన్: జిల్లా కురుమ ఉద్యోగుల సంఘం నూతన కమిటీని సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా రాములు, స్వామి, గౌరవ సలహాదారులుగా ఐలయ్య, వెంకన్న, వెంకట్, గౌరవ అధ్యక్షులుగా రాములు, రవి, ఉపాధ్యక్షుడిగా మల్లేశంను ఎన్నుకున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

వర్గల్(గజ్వేల్): మండలంలోని నాచారానికి చెందిన ఇరువురికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.1,43,000 మంజూరయ్యాయి. గ్రామానికి చెందిన అరికెల శ్రీనివాస్‌కు రూ.1,20,000, గడ్డం లక్ష్మీనర్సింహకు రూ.23,000 మంజూరైన చెక్కులను శనివారం మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు జాలిగామ వెంకటేష్‌గౌడ్ అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కొత్తపల్లి ఆంజనేయులు, కట్టె వెంకటేశం సిద్దిరాములు పాల్గొన్నారు.

స్మారక పోటీలు

చేర్యాల(సిద్దిపేట): మండలంలోని చుంచనకోట గ్రామ వార్డు సభ్యుడు బ్రమండ్ల పల్లి శ్రీకాంత్ స్మారకార్థంగా సర్పంచ్ ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్, కొమురవెల్లి మల్లికార్జున స్వామి పాలక మండలి సభ్యుడు సూటిపల్లి బుచ్చిరెడ్డి, మాజీ ఎంపీటీసీ వడ్లకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. గోదా కల్యాణం

కొండపాక(గజ్వేల్): మండలంలోని సిర్సనగండ్లలో రుక్మిణీ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో శనివారం గోదా రంగనాయక కల్యాణం కనులపండువగా సాగింది. ఉత్సవ విగ్రహాలను వీధుల్లో ఊరేగింపు నిర్వహించి, డప్పు చప్పుళ్ళతో పుస్తె మట్టెలను కల్యాణ వేదికకు తీసుకువచ్చారు. అర్చకుడు అజయ్ చారి వేదమంత్రాలు, మేళతాళాలు, మంగళ వాయిద్యాల ధ్వనుల మధ్య కల్యాణం జరిపించారు. సిద్దిపేట, మర్పడ్గ గ్రామాల ప్రజలు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని పొట్లపల్లి శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో శనివారం శ్రీగోదాదేవి రంగనాయక కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిపించారు. శివరామకృష్ణ భజన మండలి ఆలపించిన పాటలు ఆకట్టుకున్నాయి. వైస్ ఎంపీపీ దేవసాని నిర్మల, అర్చకులు పి.వెంకటరామకృష్ణ, చెందర్‌రెడ్డి, జితెందర్‌రెడ్డి, రాందత్తారెడ్డి, భరత్‌రెడ్డి, అర్జున్‌రెడ్డి, రజనీ దంపతులు, మోహన్, జగదీశ్వరచారి, దేవదాసు, నర్సింహారెడ్డి ఉన్నారు.

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకిలో శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శనివారం నిర్వహించిన గోదాదేవి రంగనాయకుల కల్యాణం ఘనంగా జరిగింది. పూజారి మదుసూదనచారి ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ద్యావనపెల్లి మంజుల, హరిప్రియ, భక్తులు పాల్గొన్నారు. బెజ్జంకిలోని గూడెంలో జరిగే కాట్రేవుల పండగను శనివారం గ్రామస్తులు ఘనంగా జరిపారు.



హుస్నాబాద్‌రూరల్: కల్యాణానికి హాజరైన భక్తులు

రైతులు తమ ఎద్దుల బండ్లను అలంకరించి గ్రామ శివారులో కాట్రేవుల పండగ నిర్వహించారు.

దుబ్బాకటౌన్: మండలంలోని కూడవెల్లి వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం గోదా రంగనాయక స్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం 1 గంటలకు ఆలయ అర్చకుడు శ్రీనివాసచార్య ఆధ్వర్యంలో కల్యాణోత్సవం నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ పట్టణం రామాలయం, వేంకటేశ్వరాలయంతో పాటు పలు ఆలయాల్లో శనివారం శ్రీగోదా రంగనాథస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారుల వేద మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణం వైభవంగా సాగింది.



కూడవెల్లిలో ..

ప్రజల సంక్షేమానికి కృషి

దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు

దుబ్బాకరూరల్: నియోజకవర్గంలో ప్రజల సంక్షేమానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. మండలంలోని చిట్టాపూర్‌లో ఏడాది క్రితం కారు బావిలో పడిన ఘటనలో సహాయ చర్యల్లో పాల్గొని ప్రమాదవశాత్తు మృతిచెందిన ఎనగుర్తి గ్రామానికి చెందిన గజ ఈతగాడు బండకాడి నర్సింలు కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. గంతలో రూ.50వేలు అందించగా, శనివారం మరో రూ.50వేలు అందించారు. పిల్లలను సొంత ఖర్చులతో చదివిస్తానని హామీ ఇచ్చారు.



సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

బ్రహ్మోత్సవాలకు ముస్తాబు

కొండపాక(గజ్వేల్): కొండపాక మండలం దుద్దెడ స్వయంభూ శంభు ఆలయంలో ఈనెల 17 నుంచి 19వ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సేవా సమితీ చైర్మన్ గొల్లపల్లి రాంచంద్రమూర్తి పేర్కొన్నారు. వేడుకలకు మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిలను ఆహ్వానించినట్లు ఆయన తెలిపారు. 17న ప్రత్యేక పూజలు, బండ్లు తిరుగుట, 18న పూజలు హోమం, రాత్రి దిష్టికుంబాలు, ఆలయ ప్రదక్షణం, 19న స్వామి వారి ఎదుర్కోలు, 11.27గంటలకు శివపార్వతుల కల్యాణం, అన్నదాన వితరణ, రాత్రి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు ఉంటుందని తెలిపారు.



విద్యుత్ కాంతులతో స్వయంభూ ఆలయం

జోరుగా ఎడ్ల బండ్ల పోటీలు

అక్కన్నపేట(హుస్నాబాద్): సంక్రాంతి పండగ సందర్భంగా మండలంలోని చౌటపల్లి గ్రామంలో ఎడ్ల బండ్ల పోటీలను నిర్వహించారు. చౌటపల్లి నుంచి మంచినీళ్ల బండ గ్రామ క్రాస్ రోడ్డు వరకు వెళ్లి తిరిగి చౌటపల్లికి పోటీలను నిర్వహించారు. పోటీల్లో యువరైతులు, యువకులు పాల్గొన్ని హోరెత్తించారు. మొదటి బహుమతి ఆవుల రాజయ్య, రెండో బహుమతి గెంటే రాజయ్య, మూడో బహుమతి గంటల బాలయ్య, నాలుగో బహుమతి పులికాశి మైసయ్య గెలుపొందారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొత్తకొండ పోశెట్టి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



చౌటపల్లి గ్రామంలో ఎడ్ల బండ్ల పోటీలు

క్రీడలతో మానసికోల్లాసం

చిన్నకోడూరు(సిద్దిపేట): క్రీడలతో శారీరదారుఢ్యంతో పాటు మానసికోల్లాసం పెంపొందుతుందదని గంగాపూర్ సర్పంచ్ పన్యాల లింగారెడ్డి అన్నారు. మండలంలోని గంగాపూర్‌లో జరుగుతున్న వాలీబాల్ క్రీడలను శనివారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు వెంకట్ రెడ్డి, రాజు, సతీష్, సాగర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

కొమురవెల్లి(సిద్దిపేట): క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఎంపీపీ తలారి కీర్తన అన్నారు. శనివారం మండలంలోని మర్రిముచ్చాలలో నిర్వహించిన క్రీడలను సర్పంచ్ బోడుగం పద్మతో కలసి ప్రారంభించారు. కార్యక్రమంలో బోడుగం కృష్ణారెడ్డి, తలారి కిషన్, బోడుగం వంశీ, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్ లింగారెడ్డి

తొగుట(దుబ్బాక): మండలంలోని లింగంపేటలో సంక్రాంతి పండగ సందర్భంగా మండల స్థాయి క్రికెట్ పోటీలను సర్పంచ్ మంగ రేణుక శనివారం ప్రారంభించారు. ఓడినవారు స్ఫూర్తిగా తీసుకుని గెలుపు కోసం తిరిగి ప్రయత్నించాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుదర్శన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు బండ మల్లన్న జాతర

మిరుదొడ్డి(దుబ్బాక): సంక్రాంతి పండగ సందర్భంగా అక్బర్‌పేట–భూంపల్లి మండలంలోని వీరారెడ్డిపల్లి, జంగపల్లి శివారులో మల్లన్న ఆలయం జాతర ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆదివారం ప్రారంభమయ్యే జాతరలో ఉమ్మడి జిల్లాల నుంచే కాక చుట్టపక్కల భక్తులు తరలివచ్చి ఆలయం చుట్టూ బండ్ల బోనాలు ఊరేగిస్తారు. బండ సొరికెలో వెలసిన స్వామి వారిని దర్శించుకొని పూజలు చేస్తారు. చెప్యాల శివారులో ఆదివారం సోమన్న గుట్ట జాతర జరగనుంది. జాతరకు మండలంలోని దుబ్బాక, దౌల్తాబాద్, రాయపోల్, గజ్వేల్, సిద్దిపేట నుంచి భక్తులు తరలిరానున్నారు. సోమలింగేశ్వర స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. చెప్యాల, తడ్కపల్లి గ్రామాలకు చెందిన భక్తులు సామివారి గుడి చుట్టూ బండ్ల బోనాలను ఊరేగిస్తారు.

రెడ్డి సంఘం నూతన కార్యవర్గం

నంగునూరు(సిద్దిపేట): నంగునూరు గ్రామ రెడ్డి సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వల్లపురెడ్డి రాంరెడ్డి, ఉపాధ్యక్షుడిగా రేకులపల్లి వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా చౌడిచెర్ల వెంకట్రామిరెడ్డి, కార్యదర్శిగా రాసారపు రవీందర్‌రెడ్డి, కోశాధికారిగా సూదిరెడ్డి రాంరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా నారాయణరెడ్డి, మోహన్‌రెడ్డి, బాల్‌రెడ్డి, రజనీకర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, మల్లారెడ్డి ఎన్నికయ్యారు.

సంక్రాంతి పండగ సందర్భంగా శనివారం అన్ని గ్రామాల్లో భోగి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇళ్లల్లో పిండి వంటలు, చిన్నారులు గాలి పటాల సందడి, ఇంటి ఎదుటకి విచ్చేసిన గంగిరెద్దులు, వాకిళ్లలో అందమైన రంగవల్లులు, వాటిలో నవధాన్యాలు, గొబ్బెమ్మల అలంకరణతో పండుగ శోభ సంతరించుకుంది. తెల్లవారుజామున భోగి మంటలతో ప్రారంభమైన సందడి రోజంతా కొనసాగింది.



దుబ్బాకరూరల్: విజేతలకు బహుమతులు అందజేస్తున్న జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి



మద్దూరు(హుస్నాబాద్): విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్‌ఐ నారాయణ

ఘనంగా భోగి సంబురాలు



నంగునూరు: భోగి మంటల వద్ద మహిళలు, చిన్నారులు



హుస్నాబాద్: బహుమతి అందిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత



నంగునూరు(సిద్దిపేట): ముగ్గులు వేస్తున్న మహిళలు



సిద్దిపేట పట్టణంలో భోగి మంటలు



సిద్దిపేటరూరల్: బహుమతులు అందిస్తున్న దృశ్యం

విజేతలకు బహుమతులు

హుస్నాబాద్‌రూరల్: మహిళల కళలను వెలికి తీసేందుకు ముగ్గుల పోటీలు దోహదపడతాయని ఎస్సై శ్రీధర్ అన్నారు. మండలంలోని పందిల్ల గ్రామంలో సంక్రాంతిని పురస్కరించుకొని శనివారం సర్పంచ్ తోడేటి రమేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల కార్యక్రమంలో ఆయన పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలు పల్లె ప్రజల జీవన శైలిని తెలుపుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ విజయలక్ష్మి, ఉపసర్పంచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుతో మురిపెం..

సంక్రాంతి పండగ విశిష్టతను తెలిపేలా అందమైన రంగవల్లులను వేసిన వారి ఫొటోలను సాక్షి పత్రిక ప్రచురిస్తామని చెప్పిన విషయం తెలిసిందే. శనివారం సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా వాట్సాప్‌కు పంపించిన ముగ్గులతో సెల్ఫీలు.



మమత, చిన్నకోడూరు



అర్చన రెడ్డి, సిద్దిపేట



కావ్య, తిగుల్



అమూల్య, బెజ్జంకి



పూజిత, భరత్‌నగర్, సిద్దిపేట



ఆకుల రజిత, మున్సిపల్ చైర్ పర్సన్, హుస్నాబాద్



కోదాది అక్షయ, రాఘవాపూర్



సునీత, సిద్దిపేట



హేమలత, దుబ్బాక



ఆకుల హరిప్రియ, హుస్నాబాద్




సుజాత, తేజ, సిద్దిపేట



డాక్టర్ దీపాంజలి, చేర్యాల



బెదురు వర్షిణి, సిద్దన్నపేట



మణికర్ణిక, భరత్‌నగర్, సిద్దిపేట



రమ్య, రాఘవాపూర్